క్లుప్తంగా

మాదిగ మహిళా సమాఖ్య గ్రామ కమిటీ ఎన్నిక



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని స్నేహకాలనీలో మాదిగ మహిళా సమాఖ్య గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఆకునూరి రమ, అధికార ప్రతినిధిగా గొర్రె స్వప్న, ఉపాధ్యక్షులుగా బొక్క అరుణ, కోగిల శ్రీలత, ప్రధాన కార్యదర్శిగా గబ్బెట సరిత, ప్రచార కార్యదర్శిగా పాలుమారి సరిత, సభ్యులుగా గంగారపు మహేశ్వరి, అరూరి పుష్పలత, కొంకటి రజిత, పాలుమారి భాగ్య, పాలుమారి సుశీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆకునూరి రమ మాట్లాడారు. ఐదేళ్లుగా మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పని చేయడం ఉద్యమ స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మహిళలను ఏకం చేసి వర్గీకరణ సాధన దిశగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శాయంపేట : మండల కేంద్రంలో నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయం విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కటాక్షపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పెద్ద కోమటిపల్లి గ్రామానికి చెందిన తిప్పారపు బాపురావు ద్విచక్ర వాహనంపై ములుగు నుంచి వస్తుండగా కటాక్షపూర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాపురావుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు 108 ద్వారా వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బాపురావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

పరామర్శ



నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన తిప్పారపు రాజేశ్వర్‌రావు మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు గురువారం పరామర్శించారు. రాజేశ్వర్‌రావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాజేశ్వర్‌రావు మృతి బాధాకరమన్నారు. తొలుత రాజేశ్వర్‌రావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌రావు, లోకాటి నగేష్, వాంకే రాజు, రవి, శ్రీకాంత్, వీరేశం, నరేష్, చింటూ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గట్లకనిపర్తిలో..

శాయంపేట : మండలంలోని గట్లకనిపర్తి గ్రామానికి చెందిన పల్లెబోయిన మల్లయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీజేపీ అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ చందుపట్ల కీర్తిరెడ్డి గురువారం పరామర్శించారు. తొలుత మల్లయ్య చిత్రపటానికి కీర్తిరెడ్డి నివాళులర్పించారు. మల్లయ్య మృతిపై అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆమె వెంట నాయకులు తాటికొండ రవికిరణ్, సాగర్, సాంబయ్య, కరుణాకర్, స్రవంతి, సంతోష్ తదితరులున్నారు.

ఆర్థికసాయం



దామెర : మండలంలోని దుర్గంపేట్ గ్రామానికి చెందిన చిల్ల సంపత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి సర్పంచ్ పురాణం రాజేశ్వరి ఈశ్వర్ గురువారం రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. తొలుత మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. సంపత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కులపెద్దలు పస్తం వీరస్వామి, పురాణం సారయ్య, పురాణం రాజ్‌కుమార్, కడెం రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

దామెర : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని ఊరుగొండలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం రామలింగేశ్వరస్వామికి గణపతి పూజ, రుద్రాభిషేకములు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ గణపతి రుద్ర సహిత మహా మృత్యుంజయ హోమం చేశారు. తదుపరి శివపార్వతుల కళ్యాణాన్ని వేడుకగా చేపట్టారు. శివపార్వతులకు సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలు, తలంబ్రాలు సమర్పించారు. మల్లాడి రాజిరెడ్డి దంపతులు వెండి శఠగోపం బహూకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆదిదంపతుల పరిణయం నిర్వహించారు. కళ్యాణం అనంతరం మహాఅన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాల శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై గైకడి అనిల్‌కుమార్, ప్రముఖ కవి వరంగల్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ యాదగిరి, ఉపసర్పంచ్ జన్ను విద్యాసాగర్, వార్డు సభ్యులు, శివాలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఉపేందర్ శర్మ, వచ్చులూరు శరత్ శర్మ, వచ్చులూరు శ్రవణ్ శర్మ, రవీందర్ శర్మ, తూపురాణి శ్రీనివాస్, సుమంత్ శర్మ, మణి శర్మ పాల్గొన్నారు.



శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న పండితులు

గట్టు మల్లికార్జునస్వామికి సీపీ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న సీపీ రంగనాథ్



అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ రంగనాథ్

ధర్మసాగర్ (వేలేరు) : వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులోని శ్రీ గట్టు మల్లికార్జునస్వామి ఆలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) ఏవీ.రంగనాథ్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 18న మహాశివ రాత్రి పండుగను పురస్కరించుకొని ఆలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల కోసం చేస్తున్న ఏర్పాట్లను తొలుత ఆయన పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం, భద్రత ఏర్పాట్లకు సంబంధించి పోలీసు అధికారులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఎం ఏ.బారి, కాజీపేట ఇన్‌చార్జి ఏసీపీ రఘుచందర్, జెడ్పీటీసీ చాడ సరిత, ధర్మసాగర్ సీఐ ఒంటేరు రమేష్, వేలేరు ఎస్సై నవీన్ కుమార్, ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ అర్చకులు వినయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ ఎల్లమ్మ ఉత్సవాలు



పట్నాలు వేస్తున్న పద్మశాలీ కులస్తులు

శాయంపేట : మండల కేంద్రంలోని బాసాని వర్గానికి చెందిన పద్మశాలీ కులస్తులు ఐదేళ్లకోసారి నిర్వహించే ఈదమ్మ ఎల్లమ్మ ఉత్సవాలను నాలుగు రోజులుగా కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఒగ్గు పూజార్లు సంస్కృతి సంప్రదాయాలతో పెద్ద పట్నం వేసి పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాష్, శివ మార్కండేయ ఆలయ కమిటీ చైర్మన్ సూర్యప్రకాష్, కుల పెద్దలు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

దామెర : శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని సినీ గేయ రచయిత, కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ కోరారు. శివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన సంగీత విభావరి కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత విభావరి కార్యక్రమం ద్వారా అధ్యాత్మిక, భక్తి గీతాలు శివభక్తులకు మానసిన ప్రశాంతత, భక్తి భావం పెంపొందించేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. శ్రీరాం ఫౌండేషన్ చైర్మన్ గురిజాల శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ సంగీత విభావరిలో వరంగల్ శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమ గాయకులు గిద్దె రాంనర్సయ్య, ఇనుగుర్తి మధు, గొలుసుల రంజిత్, అంతడుపుల శారద, బక్కి యాదయ్య, మైదం జ్యోత్స్న, మిమిక్రీ కళాకారుడు రాజు, జానపద నృత్య కళాకారులు శివాణి, శ్రావ్యతోపాటు పలువురి ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, జంగం రాణి, ఫౌండేషన్ సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న శ్రీనివాస్

మూడ్రోజుల్లోనే ఇంటి నిర్మాణ అనుమతి.. : చైర్‌పర్సన్



అనుమతి పత్రంతో సత్యనారాయణ

పరకాల : దరఖాస్తు చేసిన నాటి నుంచి మూడ్రోజుల్లోనే ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ తెలిపారు. పట్టణానికి చెందిన నిప్పాని హైమావతి ఈనెల 13న ఇంటి నిర్మాణ అనుమతి కోసం టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకోగా ఆమె భర్త సత్యనారాయణకు అనుమతి పత్రాన్ని గురువారం అందజేసి వివరాలు వెల్లడించారు. హైమావతి దరఖాస్తుకు మూడ్రోజుల్లోనే అప్రూవల్ లభించిందని తెలిపారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన కొత్త మున్సిపాలిటీ చట్టంతో దళారులకు పైసా ఇవ్వాల్సిన అవసరం లేకుండానే అనుమతి లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే రమేశ్‌పై కాంగ్రెస్ చార్జ్‌షీట్

● విడుదల చేసిన నాయకులు

వర్ధన్నపేట : వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌పై తొమ్మిది అంశాలతో, తోడుదొంగలు పేరిట బీజేపీ, బీఆర్ఎస్‌లపై కాంగ్రెస్ పార్టీ చార్జ్‌షీట్ విడుదల చేసింది. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు కసిగా ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆ పార్టీని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని చెప్పారు. ప్రజల స్పందన చూస్తే కాంగ్రెస్ రానున్న ఎన్నికల్లో 100 సీట్లు గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించే ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే అనడం పరిపాటని, కానీ.. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను మాత్రం కబ్జా కోర్ అని పిలవడం సమంజసంగా ఉంటుందని విమర్శించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం నీళ్ల పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు కోసమని లక్షల కోట్లు దండుకుందని ఆరోపించారు. జాతీయ కాంగ్రెస్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ధరణిని రద్దు చేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చార్జ్‌షీట్‌లో ఇలా..

-అరూరి రమేశ్ కన్నుపడితే ఏ భూమైనా కబ్జా కావాల్సిందే. అంబాల మార్గంలో వందల ఎకరాల భూమి కాజేశాడు. మంద కృష్ణ బంధువుల భూమిని కబ్జా చేసి బెదిరించాడు.

-ఆకేరు, కొత్తపల్లి వాగుల నుంచి అక్రమంగా మొరం తరలిస్తూ రూ.కోట్లు గడించాడు. మైనింగ్‌లో అక్రమంగా దోచుకుంటూ మైనింగ్ రారాజుగా గుర్తింపు పొందాడు.

-హామీలు అమలు చేయడు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తాడు. దళితుడైనా దళితబంధులో 30 శాతం కమీషన్లు తీసుకుంటాడు.

-2020లో కోనారెడ్డి చెరువుకు కేటాయించిన నిధులు కాజేశాడు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు అడుగుతుండటంతో ఎవరూ ముందుకు వస్తలేరు.

-బీఆర్ఎస్, బీజేపీ తోడు దొంగలని, అరాచక పార్టీలను పాతర వేసి కాంగ్రెస్ పార్టీతో కలిసి నడుద్దాం అనే మరో చార్జ్‌షీట్ విడుదల చేశారు.

'ఆయుష్మాన్ భారత్'తో మేలు

ఎల్కతుర్తి : ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్ భారత్ జన్ ఆరోగ్య యోజన' పథకంతో పేదలకు మేలు చేకూరనుందని భారతీయ జనతా గొర్ల కాపర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు ముష్కె వెంకటేశ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకంలో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ పేరు నమోదు చేసుకుని రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు పల్లెవేన రాజు, నాయకులు విజయ్, తిరుపతి, కుమారస్వామి, సదానందం, అరుణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన



స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాయంపేట : మండలంలోని గట్లకనిపర్తి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈఓగా నవ్య, హెచ్‌ఎంగా కుసుమ నవదీప్, ఎంఈఓగా అక్షయతోపాటు పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బండారి మధు, ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, భాస్కర్, రాంచందర్‌రావు, శారద, కైలాస్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వినోద్

కమలాపూర్ : తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన పుల్ల వినోద్‌కుమార్ రెండోసారి నియమితులైనట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏర్పుల శ్రీహరి, ముత్యాల జంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా పుల్ల హేమంత్‌కుమార్, కార్యదర్శిగా ఇనుగాల రాము, సహ కార్యదర్శిగా గాజుల సురేష్ నియమితులయ్యారని వివరించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.



పుల్ల వినోద్‌కుమార్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న నాయకులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ధర్మసాగర్ : జిల్లా సహకార బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు స్థానిక బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్ తెలిపారు. మండలంలోని జానకిపురం గ్రామంలో వరంగల్ జిల్లా సహకార బ్యాంకు ధర్మసాగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నాబార్డ్ ఆర్థిక సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత కళాకారులు బ్యాంక్ అందిస్తున్న సేవలను కళారూపాల ద్వారా ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ వెంకటేశ్ మాట్లాడుతూ సహకార మిత్ర డిపాజిట్ పథకంలో 499 రోజులకు 8 శాతం వార్షిక వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిపారు. లక్షకు మించిన మొత్తం డిపాజిట్ చేస్తే 8.1 శాతం వడ్డీ అందిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు నుంచి దీర్ఘకాలిక రుణాలతోపాటు కోళ్లు, గొర్రెలు, గేదెల పెంపకం, ట్రాక్టర్, హార్వెస్టర్ కొనుగోలు, విద్యార్థులకు ఉన్నత చదువులకు రుణములు అందిస్తున్నట్లు వివరించారు. సదస్సులో బ్యాంకు డీజీఎం కురువ, ఏఎం జి.బాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేనేజర్ వెంకటేశ్

పేదల కోసమే 'కంటి వెలుగు' కేంద్రాలు



పరకాల : కళ్లద్దాలు అందిస్తున్న చైర్‌పర్సన్



ఐనవోలులో..

పరకాల : ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో డబ్బు చెల్లించి వైద్యం చేయించుకోలేని పేదల కోసమే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని 9వ వార్డులోని శ్రీనివాస కాలనీలోని చేనేత సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని స్థానిక కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారితో కలిసి చైర్‌పర్సన్ గురువారం ప్రారంభించి మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రజలకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు మార్క ఉమ, ఏకు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ మార్నేని మధుమతి కోరారు. మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లకుపైబడ్డ ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కడుదూరి రాజు, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ పొన్నాల రాజు, సొసైటీ డైరెక్టర్ రాజారపు కుమార్, నాయకులు పెండ్లి మల్లారెడ్డి, పెండ్లి తిరుపతి, గోనె కుమారస్వామి, సంపత్, వైద్య సిబ్బంది సరస్వతి, రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో మెరుగైన ఆదాయం

● పట్టు పరిశ్రమ శాఖ ఉపసంచాలకుడు మురళీధర్‌రెడ్డి

ఎల్కతుర్తి : మల్బరీ సాగు చేస్తే రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని పట్టు పరిశ్రమ శాఖ జిల్లా ఉపసంచాలకుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో సరళ సిల్క్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళలకు దారం తీయడంలో మెళకువలు నేర్పించేలా గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో తొలి శిక్షణ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. 25 మంది మహిళలకు 10 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఆటోమెటిక్ రీలింగ్ యూనిట్ మంజూరౌతుందని వివరించారు. సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యుడు ప్రకాష్ భాటియా, శాస్త్రవేత్త అశోక్ దేశాయ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సారంగపాణి, రవీందర్‌రావు, నవీన్ పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మురళీధర్‌రెడ్డి

'రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే'



ఆత్మకూరు : మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

ఆత్మకూరు : రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలిచి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని చౌళ్లపల్లి, కామారం గ్రామాల్లో గురువారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. స్వరాష్ట్ర సాధన అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జ సత్యనారాయణ, ముత్యాల శ్రీనివాస్, ఇర్సడ్ల సదానందం, ఉప్పుగల్లు శ్రీకాంత్, శ్రావణ్, సదానందం, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కేంద్ర' పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎల్కతుర్తి : మండలంలోని తిమ్మాపూర్, బావుపేట గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నేత జన్నారపు సురేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రానున్న ఎన్నికల్లో హుస్నాబాద్ గడ్డపై కాషాయ జెండా ఎగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జనగాని కిష్టయ్య, వీరమల్ల కృష్ణారెడ్డి, రవితేజ, కుమాస్వామి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణ కీలకం : ఏసీపీ

పరకాల : విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే చదువుతోపాటు క్రమశిక్షణ కీలకమని ఏసీపీ జే.శివరామయ్య తెలిపారు. మండలంలోని నాగారం గ్రామంలో మాజీ సర్పంచ్ చిట్టిరెడ్డి బుచ్చిరెడ్డి స్మారకంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా గురువారం నిఘంటువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శివరామయ్య మాట్లాడారు. ఆంగ్ల భాష మీద పట్టు సాధించడానికి నిఘంటువులు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు నిఘంటువులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్కూరి స్రవంతిరెడ్డి, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్ధన్, పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు గట్ల విజయపాల్‌రెడ్డి, రొండ భాస్కర్‌రెడ్డి, ఒంటేరు రాజమౌళి, లక్కం శంకర్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరకాల ఏసీపీ జే.శివరామయ్య

కేసీఆర్ పాలనకు చరమగీతం ఖాయం

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి

పరకాల : సీఎం కేసీఆర్ సాగిస్తున్న దుర్మార్గపు పాలనకు ప్రజలు చరమగీతం పాడడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి స్పష్టం చేశారు. ఈనెల 5న బీజేపీ, బీఆర్ఎస్ నడుమ గొడవ జరిగిన క్రమంలో అరెస్టైన బీజేపీ నాయకులు గురువారం సాయంత్రం స్థానిక సబ్‌జైల్ నుంచి విడుదలయ్యారు. ఈ క్రమంలో జైల్ విడుదలైన వారికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతితోపాటు శ్రేణులు ఘనస్వాగతం పలికి ఊరేగించారు. ఈ సందర్భంగా రావు పద్మ, భిక్షపతి మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలను లెక్క చేయకుండా అనేక ఉద్యమాలు చేశామన్నారు. బస్సులను అడ్డుకున్నప్పుడు, దాడులు చేసిన సమయంలోనూ నాటి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించలేదని చెప్పారు. మోసపూరిత హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై దమనకాండ సాగిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను ఓర్వలేక స్వల్ప ఘటనలను సైతం సాకుగా చేసుకుని పోలీసులతో అక్రమ కేసులు బనాయింపజేస్తోందని మండిపడ్డారు. శ్రేణులను అక్రమ కేసులతో వేధించాలని యత్నిస్తే ప్రజలే బీఆర్ఎస్‌కు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ.జయంత్‌లాల్, కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణాచారి, కొలను పాక భద్రయ్య, పట్టణ నాయకులు దుబాసి వెంకటస్వామి, మేకల రాజవీరు, సంగ పురుషోత్తం పాల్గొన్నారు.



జైల్ నుంచి విడుదలైన వారికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు